క్లుప్తంగా

రూ.54లక్షలతో అదనపు గదుల నిర్మాణం



దామరగిద్ద: మండల కేంద్రంలోని జీపీఎస్ పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.54 లక్షల నిధులతో మంజూరు చేసిన అదనపు గదుల నిర్మాణం పనులను కాంట్రాక్టర్ శరణప్ప ప్రారంభించారు. పిల్లర్ల నిర్మాణం పనులు ప్రారంభించామని, సకాలంలో పనుల పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రాకొండలో వేసవి తరగతులు

మరికల్: మండలంలోని రాకొండలో గురువారం సర్పంచ్ రాజు వేసవి తరగతులను ప్రారంభించారు. ఉదయం సమయంలో రోజుకు రెండు గంటల పాటు విద్యార్థులకు తరగతులను నిర్వహించడం, ఆట, పాటలు, నృత్యాలు, క్రీడల పట్ల అవగాహన కల్పిస్తామని సర్పంచ్ తెలిపారు. వేసవి తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీటీ రోడ్డు పనుల పరిశీలన



ఊట్కూర్: మండల కేంద్రంలో కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులను పీఆర్ డీఈ మంగూలాల్ గురువారం పరిశీలించారు. స్థానిక బస్టాండ్ నుంచి గాంధీ నగర్ వరకు వారం రోజుల నుంచి బీటీ రోడ్డు పనులు కొసాగుతున్నాయి. సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, ఏఈ జగత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని సరఫరా చేయాలి

కృష్ణా: మండల కేంద్రానికి తాగునీటిని సరఫరా చేయాలని సర్పంచ్ రాధ మహదేవ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజులుగా నీటి సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారేవుల వద్ద ఉన్న మోటార్ల కెపాసిటీ తక్కువగా ఉండటంతో పంపింగ్ సమస్యలు తలెత్తున్నాయని వాపోయారు. గుడెబల్లూర్ గ్రామం వరకు మాత్రమే తాగునీరు సరఫరా అవుతోందన్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.

'సాల్మాన్ రాజుకు ఎమ్మెల్సీ ఇవ్వాలి'

మక్తల్: తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్స్ ప్రధాన కార్యదర్శి గోనే సాల్మాన్ రాజుకు నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ప్రసాద్‌లు గురువారం ఓ ప్రకటనలో కోరారు. వివిధ సేవలకు చేస్తున్న సాల్మాన్‌రాజును గుర్తించాలని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మక్తల్: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని భూత్పూర్ వాగు నుంచి మక్తల్‌కు అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నారు. భూత్పూర్‌లో పోలీసుల తనిఖీలో ట్రాక్టర్ పట్టుబడింది. ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

అనుమతి లేని పాఠశాలల్లో చేర్పించొద్దు



మక్తల్: అనుమతి లేని పాఠశాలల్లో పిల్లలను చేర్పించొద్దని ఏబీవీపీ నగర కార్యదర్శి వంశీ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. పట్టణంలో చైతన్య పేరుతో ఒక బోగస్ పాఠశాల అడ్మిషన్లు ప్రారంభించిందని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినయ్, సురేష్, వినయ్, శరణ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగతో నేల సారవంతం

- 65 శాతం సబ్సిడీతో విత్తనాలు
- ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో లభ్యం



దామరగిద్దలో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

దామరగిద్ద: నేల సారవంతానికి పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ సాగుతో సహజ సిద్ధ పోషకాలు పెరిగి ఎంతో ప్రయోజనాన్ని కలుగజేస్తాయని మండల వ్యవసాయ అధికారి అరవింద్, ఎంపీపీ నర్సప్ప, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, నేల కాలుష్యాన్ని నివారించడమే కాకుండా పెరిగిన ఎరువుల ధరలతో పెట్టుబడులు తగ్గించుకునే అవకాశం ఉందన్నారు. నేల సారవంతంతో పాటు తేమశాతం పట్టి ఉండటం, పంట నాణ్యత వంటి ప్రయోజనాలు కలుగుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పచ్చిరొట్ట సాగును పెంచేందుకు విత్తనాలను 65 శాతం సబ్సిడీపై అందజేస్తుందని తెలిపారు. వర్షాకాలం సమీపించడంలో పంటల సాగులో విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, సాగు మెలకువల వంటి జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో బాపన్‌పల్లి మాజీ సర్పంచ్ తిప్పణ్ణ, దామరగిద్ద మాజీ ఎంపీటీసీ కన్నిరెడ్డి, విండో కార్యదర్శి మురారి, ఏఈఓలు గోపాల్, నరేష్, అజయ్, స్వప్న, శివజ్యోతి, భార్గవి, అనిల్, ఫర్టిలైజర్ డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలో రైతు ఆగ్రో ట్రేడర్స్ కేంద్రంలో గురువారం రైతులకు జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, ఎంపీపీ శ్రీకళ జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. మరికల్ మండలానికి మొదటి విడత కింద 333 బస్తాల జీలుగ విత్తనాలు వచ్చాయని తెలిపారు. ఒక్కొక్క ప్యాకెట్‌కు సబ్సిడీ పోనూ రూ.843కు రైతులకు అందజేస్తామన్నారు. వరిసాగు చేసే రైతులు తప్పకుండా జీలుగ విత్తనాలు వేసుకోవాలని సూచించారు. దీంతో భూమి సారవంతంగా మారి దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవి, ఎంపీటీసీ గోపాల్, ఏఓ శివకుమార్, విష్ణు, రాజవర్ధన్‌రెడ్డి, రామస్వామి, కృష్ణారెడ్డి, శేఖర్, తిరుపతయ్య, శివ, సచిన్, సుదీప్‌రెడ్డిలు పాల్గొన్నారు.



మరికల్‌లో..

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నారాయణపేట రూరల్: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆర్‌ఎస్‌ఐ రామకృష్ణ అన్నారు. పట్టణంలోని వీరసావర్కర్ చౌరస్తాలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నెంబర్ ప్లేట్ లేకపోతే సదరు వాహనాలను క్రైం చేయడానికి వాడుతున్నారని గుర్తించాల్సి వస్తుందన్నారు. నిబంధనల ప్రకారమే నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేయాలని, ఇష్టారీతిగా ఉండరాదని సూచించారు. అదేవిధంగా జర్నలిస్టులు కాని వారు ప్రెస్ స్టిక్కర్లు పెట్టకోరాదన్నారు. వాహనం నడిపే సమయంలో హెల్మెట్, సీటుబెల్టును తప్పనిసరిగా ఉపయోగించాలని కోరారు. అతి వేగం ఎంతో ప్రమాదకరమని, నిర్ణత వేగంతోనే వాహనాలను నడపాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని అందుకు వాహన యజమానులు, పిల్లల తల్లిదండ్రులు శిక్షార్హులన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని, ఇష్టారితిగా పార్కింగ్ చేయరాదని, ఇతర వాహనాలకు ఆటంకం కల్గిస్తే జరిమానా కట్టాల్సి వస్తుందన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఎస్‌ఐ రామకృష్ణ

నేడు కంటి వైద్య శిబిరం

ఊట్కూరు: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం ఉచిత కంటి శిబిరం నిర్వహిస్తున్నట్లు గురువారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వై జనార్దన్‌రెడ్డి ఓప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ కందూరు రాంరెడ్డి ఆస్పత్రి వైద్య బృందం కంటి పరీక్షలు చేస్తారని కంటిలో శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రమాదవశాత్తు ఇంటి సామగ్రి దగ్ధం



దగ్ధమవుతున్న వస్తువులు

ఊట్కూర్: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఇంట్లో ఉన్న సామగ్రి దగ్ధమైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని ఎడివెళ్లి గ్రామానికి చెందిన బైని చిన్న నర్సిములు భార్య లావణ్య వంట చేస్తుండగా సిలిండర్ నుంచి శబ్దం రావడంతో అప్రమత్తమై ఇద్దరు పిల్లలను ఇంటి బయటకు తీసుకొచ్చింది. మహిళ అరుపులకు ఇంటిపక్కల వారు వచ్చి చూడగా అప్పటికే సిలిండర్ నుంచి మంటలు వచ్చి ఇంట్లో ఉన్న నిత్యవసర వస్తువులు, దుస్తులు, ప్లాస్టిక్ వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ. 50 వేల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పాథర్చేడ్ పాఠశాలలో..



నిడుగుర్తి పాఠశాలలో బోధిస్తున్న హెచ్‌ఎం లక్ష్మారెడ్డి

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమేష్‌కుమార్‌లు అన్నారు. గురువారం ఎంపీపీఎస్ జంగంరెడ్డిపల్లి, యాంకి, జెడ్పీహెచ్‌ఎస్ నర్వ, జెడ్పీహెచ్‌ఎస్ పాథర్చేడ్, జెడ్పీహెచ్‌ఎస్ ఉందేకోడ్‌లలో క్యాంపులను ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు శిబిరాలు ఉంటాయని నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ నర్సిములు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో చేపడుతున్న సమ్మర్ క్యాంపు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ యశోదమ్మ కోరారు. గురువారం నిడుగుర్తి , మల్లేపల్లి పాఠశాలలో సమ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా వలంటీర్ల ద్వార నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరై కొత్తకొత్త విషయాలను నేర్చుకోవాలని కోరారు. ఆటలు, పాటలు, కథలు, చిత్రలేఖనం తదితర అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో మల్లేపల్లి సర్పంచ్ మాణిక్యమ్మ, ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, నర్సింగప్ప, ఎస్‌ఎంసీ చైర్మన్ నర్సింహులు, మక్బుల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న మహిళ సంఘం సభ్యులు

మక్తల్: పట్టణంలోని పడమటి అంజనేయస్వామి ఆలయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో అంబలి పంపిణీ చేశారు. కొత్తసూగయ్యరత్నమ్మ చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో నిర్వహిస్తున్న అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల చివరి వరకు అంబలి పంపిణీ చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కొత్తమీరా బాయి, కోశాధికారి రేఖ, ప్రసన్న, పద్మ, సుజాత, ప్రత్యూష, సుష్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

బాలకేంద్రం చిన్నారులకు రాత పుస్తకాలు



నోట్స్ అందిస్తున్న అధికారులు

నారాయణపేట రూరల్: బాలకేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి హాజరవుతున్న 95మంది చిన్నారులకు ఉచితంగా రాత పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతున్న సమయంలో ఎంతో మంది తల్లులు తమ పిల్లలకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను నేర్పించాలనుకోవడం అభినందనీయమన్నారు. చదువుతో పాటు కళల్లో ప్రావీణ్యం పొందడం ఎంతో ముఖ్యమైందన్నారు. తబల, గాత్రం, నృత్యం, చిత్రలేఖనం తదితర అంశాలపై శిక్షణకు రావాలన్నారు. కార్యక్రమంలో దాత నందుపటేల్, సిబ్బంది సంగ నర్సింహులు, వసంత్, జ్ఞానామృత, శంకర్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్

నర్వ: మండలంలో ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అమ్మితే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్‌ఐ విక్రమ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సరస్వతి ఆగ్రో, మల్లికార్జున ట్రేడర్స్, సాయిరాం ట్రేడర్స్ దుకాణాల్లో ఏఓ గణేష్‌రెడ్డితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విత్తనాలను, క్రిమిసంహారక మందులను, ఎరువులను కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరి రసీద్ పొందాలన్నారు. తనిఖీల్లో వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.



నర్వలోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ, ఏఓ

వర్టికల్ ఇన్‌చార్జ్‌ల పాత్ర కీలకం

నారాయణపేట రూరల్: ప్రజల ధన, మాన, ప్రాణ, ఆస్తులను కాపాడటంలో రక్షకభటుల పాత్ర ఎంతో కీలకమైందని, అలాంటి పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేయడానికి సెక్షన్ ఇన్‌చార్జ్‌ల పాత్ర ఎంతో కీలకమని ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం అన్ని పీఎస్‌లలో విధులు నిర్వహిస్తున్న వివిధ సెక్షన్ ఆఫీసర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీసు విధులను బట్టి మొత్తం 13 విభాగాలుగా చేసి ఒక్కో సెక్షన్‌కు వర్టికల్ ఇన్‌చార్జ్‌ల నియామకం చేపట్టామని తెలిపారు. అంతా కలిసిపనిచేస్తే పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందన్నారు. క్రైం రేటు తగ్గించడానికి వీలు కలుగుతుందని అన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. బీట్, పెట్రోకార్, బ్లూకోర్ సిబ్బందిని సమన్వయం చేయాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్ నిబంధనలు పాటించాలన్నారు.



శిక్షణ ఇస్తున్న శ్రీనివాస్



రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజు

రేషన్ దుకాణం ప్రారంభం

మాగనూర్: మండల కేంద్రంలో రేషన్ దుకాణాన్ని సర్పంచ్ రాజు గురువారం ప్రారంభించారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామలమ్మ, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు వాకిటి శ్రీనివాసులు, దండు సత్యనారాయణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం

మరికల్: రాబోయే వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, ఎంపీపీ శ్రీకళ అన్నారు. మండలంలోని ఎలిగండ్లలో గురువారం పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అక్కడక్కడ అపరిశుభ్రత కన్పించడంతో వాటిని పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని సర్పంచ్‌కు సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. వర్షాలు ప్రారంభం కాగానే మొక్కలు నాటేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ మురళి, సర్పంచ్ దేవమ్మ, తిరుపతయ్య, రాజవర్ధన్‌రెడ్డి, గోపాల్, ఉస్సేన్, ప్రకాశ్ శెట్టి, హన్మంతు, రామస్వామి, సంపత్ పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

'ఉపాధి' కూలీలకు టెంట్లు అందజేయాలి



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

దామరగిద్ద: వేసవి కాలంలో ఎండ తీవ్రత కారణంగా ఉపాధి కూలీలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, ప్రభుత్వం స్పందించి వెంటనే టెంట్లు అందజేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సజనాపూర్‌లో ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశానికి వెళ్లి వారితో మాట్లాడారు. కేంద్రం ఈజీఎస్‌కు బడ్జెట్‌లో నిధుల కోత వేసి కూలీల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. వేసవి అలవెన్సులు ఇవ్వకపోగా ఎండ తీవ్రతకు టెంట్లు, తాగునీరు వంట రక్షణ చర్యలు చేపట్టకపోవడం దారుణమని మండిపడ్డారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు శివకుమార్, ఎఫ్ఏ హన్మంతు, కూలీలు కిష్టప్ప, లక్ష్మప్ప, మల్లప్ప పాల్గొన్నారు.

ఏనె చెరువు మరమ్మతు పనులు ప్రారంభం

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి శివారులోని ఏనె చెరువు నిర్మాణం పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. రెండేళ్ల క్రితం స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చొరవతో చెరువు నిర్మాణానికి రూ. 62 లక్షలు మంజూరు చేయించారు. కాగా చెరువు నిర్మాణంతో తమ పట్టాభూములు నీట మునుగుతాయంటూ రైతులు కోర్టును ఆశ్రయించారు. రైతులు కోర్టుకు వెళ్లడంతో ఇన్నాళ్లుగా పనులు నిలిచిపోయాయి. కలెక్టర్ ఆదేశాలతో కోర్టులో చెరువు ముంపు శివారు భూములు ప్రభుత్వ భూములుగా రెవెన్యూ అధికారులు సర్వే ద్వారా తేల్చడంతో పనులు ప్రారంభించినట్లు కాంట్రాక్టర్ గౌస్ తెలియజేశారు.



చెరువు మరమ్మతు పనులు చేస్తున్న జేసీబీ

మహిళా సమ్మాన్‌నిధి పథకంతో ప్రయోజనం



మాట్లాడుతున్న ఐపీఎం రవికుమార్

దామరగిద్ద: మహిళలకు వయస్సుతో సంబంధం లేకుండా 7.5 వడ్డీ రేటుతో కేంద్ర ప్రభుత్వం తపాల శాఖ ద్వారా తీసుకొచ్చిన మహిళ సమ్మాన్ నిధి పథకంలో డిపాజిట్ చేసి ప్రయోజనం పొందాలని ఐపీఓ చల్లా రవికుమార్ అన్నారు. గురువారం స్థానిక పోస్టాఫీసులో బీపీఎంలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో మహిళల కోసం కొత్తగా తీసుకొచ్చిన మహిళా సమ్మాన్ నిధి డిపాజిట్ పథకంలో రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకు ఒకేసారి డిపాజిట్ చేయవచ్చన్నారు. డిపాజిట్‌దారులకు టీడీఎస్ వర్తిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీపీఎంలు అరుణ, ఇతిషా, సంజీవ్, తిప్పణ్ణ, తపాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

మాగనూర్: ప్రతి విద్యార్థి మాతృ భాషతో పాటు, ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సులభంగా పొందవచ్చని ఎంపీపీ శ్యామలమ్మ, ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటయ్య అన్నారు. గురువారం మండల కే ంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని వారు ప్రారంభించారు. మండలంలోని రెండు కాంప్లెక్స్‌ల పరిధిలో మొత్తం తొమ్మిది పాఠశాలలో జిల్లాలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వలంటరీల ద్వారా ప్రాథమిక స్థాయి విద్యార్థులకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరాలు 20 రోజుల పాటు ఉంటాయని ప్రతి విద్యార్థులు సద్వినియోగ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, సర్పంచ్ రాజు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు నర్సింహులు, వెంకటయ్య, ఉపాధ్యాయులు, శివరాజ్, రాములు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

బీఎస్పీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మక్తల్: బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తానని బీఎస్పీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మక్తల్ మండలం గుడిగండ్లలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బహుజనుల రాజ్యాధికారం కోసం బీఎస్పీ లక్ష్యమన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు దోపిడీదారులకు అండగా నిలుస్తున్నాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాకిటి అంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్, ఇన్‌చార్జ్ శ్రీనివాస్, మక్తల్ ఇన్‌చార్జ్ పాలెం వెంకటయ్య, రమేష్, శ్రీనివాసులు, రోషణమ్మ, పరుశరాములు, కురుమూర్తి, తిరుపతి, అర్జున్‌రాజు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలం ఏర్పాటులో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న బి.రాము

నారాయణపేట రూరల్: కోటకొండను మండలంగా ప్రకటించే వరకు ఉద్యమం ఆగదని, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా నాయకులు బి.రాము స్పష్టం చేశారు. మండలంలోని కోటకొండలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గురువారం ఆయన దీక్షను ప్రారంభించి మాట్లాడారు. వెనకబడిన ప్రాంతంగా మిగిలిపోయిన కోటకొండను మండలంగా మార్చి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. విద్యా, వైద్యం తదితర విషయాల్లో హైస్కూల్, పీహెచ్‌సీలు ఎన్నో ఏళ్లుగా నడుస్తున్నాయని చెప్పారు. విద్యుత్ సబ్‌స్టేషన్ అందుబాటులో ఉందన్నారు. రాజకీయ పరంగా ఎంతో చైతన్యవంతమైన ప్రాంతమని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మి, ఎంపీటీసీ అనసూయ, నాయకులు కెంచె శ్రీనివాసులు, కాశీనాథ్, యాదగిరి, బలరాం, ఎల్లరాజు, ప్రవీణ్, ప్రభంజన్‌రావు, నర్సింహులు, సౌజన్య, నర్సిరెడ్డి, రామకృష్ణ, రాములు, పాండునాయక్, రాము, నారాయణ పాల్గొన్నారు.

ఇంటికి చేరిన తల్లీపిల్లలు

- పోలీసులు చాకచక్యంతో గుర్తింపు

మక్తల్: మండలంలోని జక్లేర్‌లో ఈనెల 13వ తేదీన తన ముగ్గురు పిల్లలతో పాటు తల్లి అదృశ్యమైంది. ఈ సంఘటనపై కేసు నమోదైంది. ఈ వ్యవహారం గురువారం సుఖాంతమైంది. కుటుంబంలో భేదాభిప్రాయాలతో మనస్తాపానికి గురైన పూజారి రాణి(24) తన పిల్లలు అమృత(8), శివాని(6) సుశాంత్(3)లను తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. మహారాష్ట్రలోని షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంతానికి వెళ్లింది. ఈఘటనపై కేసు నమోదు చేసిన ఎస్‌ఐ పర్వతాలు, తమ సిబ్బందిని షిరిడీకి పంపి, వారిని క్షేమంగా మక్తల్‌కు తీసుకువచ్చారు. ఈమేరకు గురువారం తల్లితో పాటు ముగ్గురు పిల్లలను కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.